క్లుప్తంగా

గురువులకు సత్కారం


అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

చండూరు : మున్సిపాలిటీ కేంద్రంలోని ఐటీఐలో విద్యనభ్యసించిన 1997 విద్యా సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం ఐటీఐలో తమ గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంవలో ఎస్ఐ సురేష్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ చండూరు సత్య ఐటీఐలో విద్యనభ్యసించి విద్యుత్ శాఖలో అనేక మంది ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జిసి. శేఖర్, పి.మహేష్, మల్లేషం, విజయ్, తీగల వెంకటేశ్వర్లు, రామస్వామి, క్రాంతి, కృష్ణవేణి పాఠశాల ప్రిన్సిపాల్ అలీ, వైస్ ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు.

నవంబర్ 9 వరకు ఓటు హక్కు నమోదు

మర్రిగూడ : నవంబర్ 9 వరకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ జూటూరు తారకరామన్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఓటరు తమ ఓటును మరో ప్రాంతానికి బదిలీ చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలిపారు. తహసీల్దార్ వెంట సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, సిబ్బంది ఉన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

చిట్యాల : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిట్యాల పట్టణంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో అమ్మవారు శ్రీసరస్వతి దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పూజారి దౌలతాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించారు. దాతలు వేలుపల్లి వెంకటేశ్వర్లు–సంధ్యారాణి, బండారు నిఖిల్–సుస్మితశ్రీ, వేలుపల్లి సాయి, సాక్షిత్‌లు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. నృత్యం చేసిన చిన్నారులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నాగిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రిజర్వాయర్ల పనులను త్వరగా పూర్తి చేయాలి

మర్రిగూడ : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న శివన్నగూడెం, కిష్టరాయినపల్లి రిజర్వాయర్లను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలని సీపీఎం నాయకుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నీలకంఠం రాములు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రిజర్వాయర్లలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీతోపాటు పూర్తిస్థాయి పరిహారం చెల్లించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, చల్లం ముత్యాలు, కొట్టం యాదయ్య, మైల సత్తయ్య, చొప్పరి హనుమంతు, ఉప్పునూతల వెంకటయ్య పాల్గొన్నారు.

నాంపల్లిలో వైద్యశిబిరం

నాంపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నల్లగొండ జిల్లా ఆస్పత్రి ఆధ్వర్యంలో టీబీ పరీక్షలు నిర్వహించారు. 102 మంది వైద్య పరీక్షలకు హాజరు కాగా 44 మందికి స్కానింగ్, 39 మందికి ఎక్స్‌రే, 15 మందికి తేమడ పరీక్షలు చేశామని మండల వైద్యాధికారి డాక్టర్ ఇక్బాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, సిబ్బంది సంధ్య, వసంత, సైదులు, వెంకటేష్, నారాయణ, శ్రీనివాస్, కళ్యాణి ఉన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భిక్షం



నాంపల్లి : శాలివాహన 1355 సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాంపల్లి మండలంలోని టీపీ గౌరారానికి చెందిన చిలుకూరి భిక్షం నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆకారపు మోహన్ శుక్రవారం భిక్షంకు నియామక పత్రాన్ని అందజేశారు.

తిప్పర్తి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సౌజన్య


నియామకపత్రం అందుకుంటున్న సౌజన్య

నల్లగొండ : తిప్పర్తి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వెంకటాద్రిపాలెం సర్పంచ్ దొంతినేని సౌజన్య నియమితులయ్యారు. శుక్రవారం నల్లగొండలోని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సౌజన్యకు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు బొడ్డుపల్లి జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు శూన్యం!

- సామాజిక మరుగుదొడ్లు లేక మహిళల అవస్థలు
- డ్రెయినేజీలు లేక రోడ్లపై పారుతున్న మురుగు
- ఇబ్బందులకు గురవుతున్న శాలిగౌరారం ప్రజలు


శాలిగౌరారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా

శాలిగౌరారం : కనీస మౌలిక వసతులు లేకపోవడంతో శాలిగౌరారం మండల కేంద్రంలోని ప్రజలు నిత్యం అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యాపార సంస్థలు, దుకాణాలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో మండల కేంద్రం ప్రజలతో నిత్యం రద్దీగా ఉంటుంది. కానీ సామాజిక మరుగుదొడ్లు, తాగు నీటి కులాయిలు లేకపోవడంతో వివిధ అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు.

తాగునీరు, పబ్లిక్ టాయిలెట్స్ కరువు

ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార దుకాణాలు ఉండడంతో నిత్యం వందలాది మంది వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు. కానీ మండల కేంద్రంలోని ప్రధాన రోడ్లవెంట ఎక్కడ కూడా తాగునీటి సౌకర్యం లేకపోవడం గమనార్హం. అదేవిధంగా ప్రజల వినియోగం కోసం సామాజిక మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు పడే బాధలు అన్నీఇన్నీ కావు. ఏళ్ల తరబడి సమస్యలను ఎదుర్కొంటున్నా పట్టించుకునేవారు లేకపోవడం విచారకరమని ప్రజలు వాపోతున్నారు.

ప్రధాన రోడ్ల వెంట లేని మురుగు కాల్వలు

శాలిగౌరారం మండల కేంద్రంలో నకిరేకల్–మోత్కూరు, శాలిగౌరారం–భైరవునిబండ ప్రధాన రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్లకు ఇరువైపులా దుకాణాలు, నివాస గృహాలు ఉన్నాయి. శాలి గౌరారం–భైరవునిబండ రోడ్డు వెంట తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, బ్యాంకులు ఉన్నాయి. కానీ ఈ రెండు రోడ్లవెంట సైడ్ డ్రెయినేజీలు లేకపోవడంతో ఆయా దుకాణాలు, నివాస గృహాల్లో వ్యర్థపు నీటిని రాత్రి వేళల్లో రోడ్లమీదకు వదులుతున్నారు. రోడ్లపై మురుగు ప్రవహించడంతో పాటూ గుంతల్లో నిల్వ ఉండడం వల్ల రోడ్లపై దుర్వాసన వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సౌకర్యం లేదు



మండల కేంద్రంలో సామాజిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేదు. ఏదైనా పనిమీద మండల కేంద్రానికి వస్తే తాగునీటికి, మలమూత్ర విసర్జన కోసం ఇబ్బందులు పడుతున్నాం. మండల కేంద్రానికి రావాలంటేనే మహిళలు భయపడుతున్నారు.

– గూని సాయమ్మ, గురుజాల

వ్యర్థపు నీటిని రోడ్లపైకి వదులుతున్నారు



మండల కేంద్రంలో రోడ్డు వెంట సైడ్ డ్రెయినేజీలు లేకపోవడంతో హోటళ్లు, ఇతర వ్యాపార దుకాణాల నిర్వాహకులు వ్యర్థపు నీటిని రోడ్లపైకి వదులుతున్నారు. దీంతో దుర్వాసన తట్టుకోలేక అనారోగ్యాల పాలవుతున్నాం.

– కొయ్యడ సుజాత, శాలిగౌరారం

నిధులు సరిపడా లేవు



మండల కేంద్రంలో సామాజిక మరుగుదొడ్లు నిర్మించేందుకు ఇప్పటికే గ్రామ పంచాయతీలో తీర్మానం చేశాం. కానీ స్థల సమస్యతో నిర్మించలేకపోతున్నాం. నిధులు సరిపడా లేకపోవడంతో సైడ్ డ్రెయినేజీల నిర్మాణం కష్టతరంగా మారింది.

– బట్ట హరిత, సర్పంచ్, శాలిగౌరారం

'బీఆర్ఎస్‌పై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు'

మర్రిగూడ : బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అసంతృప్తితో ఉన్నారని టీడీపీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జక్కలి ఐలయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. శివన్నగూడ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు దోమల వెంకటయ్య, పగడాల లింగయ్య, ముద్దం శ్రీనివాస్‌గౌడ్, పుప్పాల యాదయ్య, సత్యనారాయణరెడ్డి, సత్తయ్య, శ్రీరాములు, మల్లేష్, భూపతయ్య, శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

తుంగతుర్తి టీడీపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి

శాలిగౌరారం : తుంగతుర్తి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతూ శాలిగౌరారం మండలంలోని తిరుమలరాయునిగూడెంకు చెందిన టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరం లింగయ్య శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌కు హైదరాబాద్‌లో వినతి పత్రం అందజేశారు. పార్టీ అవకాశం కల్పిస్తే టీడీపీ సత్తాచాటుతానని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి

శాలిగౌరారం : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి అన్నారు. శాలిగౌరారం మండలంలోని వల్లాల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ గ్రామ ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ షేక్ ఇంతియాజ్, ఉప సర్పంచ్ గుండ్లపల్లి సైదులు, మాధారంకలాన్ ఎంపీటీసీ నోముల జనార్దన్, గ్రామశాఖ అధ్యక్షుడు జంగిలి మారయ్య పాల్గొన్నారు.

'పేదల జీవితాల్లో వెలుగులు నింపుతా'

నల్లగొండ రూరల్ : పేదల జీవితాల్లో వెలుగులు నింపుతానని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి రామరాజుయాదవ్ అన్నారు. శుక్రవారం నల్లగొండ మండలంలోని జీకే అన్నారం, అన్నారెడ్డిగూడెం, వెలుగుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు వేసి మోసపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, శ్రీను, వెంకన్న, రాములు, ఆంజనేయులు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకున్న అశోక్


దరఖాస్తు అందజేస్తున్న పోకల అశోక్

చిట్యాల : పట్టణానికి చెందిన పోకల అశోక్ నకిరేకల్ నియోజకవర్గ వైఎస్సార్ టీపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి హైదరాబాద్‌లో పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వెంట చిట్యాల పట్టణ అధ్యక్షుడు దామోదర్, చిట్యాల, రామన్నపేట మండలాల అధ్యక్షులు పల్లె రాజేందర్‌గౌడ్, వెంకటేశ్వరావు, నాయకులు పిల్లి నాగయ్య, మహేష్ ఉన్నారు.

మద్యం పట్టివేత

చిట్యాల : వెలిమినేడు గ్రామంలోని ఓ కిరాణం దుకాణంలో మద్యం అమ్ముతుండగా శుక్రవారం పట్టుకున్నట్లు చిట్యాల ఎస్ఐ రవి తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.7920 ఉంటుందని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం


చిట్యాల : మాట్లాడుతున్న వేముల వీరేశం

చిట్యాల : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రవేశపెట్టిందని, అధికారంలోకి రాగానే వాటిని పకడ్బందీగా అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం అన్నారు. చిట్యాలలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మండలానికి సాగు నీటినందించే ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బొబ్బల రాంరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ల శిశుపాల్ రెడ్డి, పోకల దేవదాసు, మాజీ జెడ్పీటీసీలు శేపూరి యాదయ్య, దూదిమెట్ల సత్తయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, పట్టణ, మండల అధ్యక్షులు జడల చినమల్లయ్య, గుడిపాటి లక్ష్మీనర్సింహ, మాజీ ఎంపీటీసీలు ఎద్దులపురి కృష్ణ, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కేతేపల్లి : మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు శుక్రవారం వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో సర్పంచ్ జటంగి ముత్తమ్మ, నాయకులు బీరం జాన్‌రెడ్డి, మట్టి సునీతసాల్మన్, ఎం.కర్ణాకర్‌రెడ్డి, ఎ.నాగయ్య, ఎ.వీరాచారి, మట్టె ముత్తమ్మ, ఆరోగ్యమ్మ, సతీష్, ఎం.పరుషయ్య, జటంగి రాంచంద్రయ్య, బి.రవి, మారగోని మల్లయ్య ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం కోరారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని 9వ వార్డులో శుక్రవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ గెలిస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పన్నాల పావని శ్రీనివాస్‌రెడ్డి, చౌగోని రజిత శ్రీను, నాయకులు గాజుల సుకన్య, యానాల లింగారెడ్డి, రంగమ్మ, బ్రహ్మదేవర రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలి


చిట్యాల : మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి

చిట్యాల : పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి అన్నారు. చిట్యాలలో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిట్యాల పట్టణంలో చిరుమర్తి లింగయ్య చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి రాబోయే ఎన్నికల్లో ఓట్లను అభ్యర్థించాలన్నారు. ఈ సందర్భంగా చిన వెంకట్‌రెడ్డి సమక్షంలో యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వల్లమల్ల యాదగిరి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

నకిరేకల్ : బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్యను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలోని వివిధ వార్డుల్లో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి


కట్టంగూర్ : మాట్లాడుతున్న తహసీల్దార్ స్వప్న

చిట్యాల : రాబోయే ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని చిట్యాల తహసీల్దార్ జి.దశరథ అన్నారు. చిట్యాల మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించి ప్రలోభాలకు గురిచేసినట్లయితే సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అదేవిధంగా మండలంలోని వెలిమినేడు, గుండ్రాంపల్లి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, ఎస్ఐ రవి, బీఎల్ఓలు, ఆశా వర్కర్స్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

కట్టంగూర్ : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ డి.స్వప్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బూత్ లెవల్ ఓటర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కు కలిగిఉన్న ప్రతి ఒక్కరూ ఓటును తప్పక వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తితే సీ విజిల్ యాప్‌లో పోస్ట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సునిత, డీటీ సుకన్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శి వి.అశోక్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కనగల్ : చర్లగౌరారం గ్రామంలో ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ జ్యోతి

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల, అప్పాజిపేట, ఎం దుప్పలపల్లి, తొరగల్, పెద్దసూరారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నల్లగొండ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం సైదులు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీలు నర్సింహ, గీతా బాయి, మల్లీశ్వరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్ మండలంలో..

కనగల్ : మండలంలోని చర్లగౌరారం, దర్వేశిపురం, పర్వతగిరి, తిమ్మన్నగూడెం, తేలకంటిగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలను సూచించారు. తేమ అధికంగా ఉన్న ధాన్యాన్ని తీసుకు రావొద్దని, ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీసీలు విజయకుమారి, అంజయ్య, వసంత, వీబీకేలు, ఐకేపీ సిబ్బంది తదితరులున్నారు.

దేశానికే ఆదర్శంగా సంక్షేమ పథకాలు

- నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి


సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో ఎమ్మెల్యే కంచర్ల ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూనే రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కేసీఆర్ నల్లగొండ పట్టణాభివృద్ధికి రూ. 1300 కోట్లు మంజూరు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అన్నారు. ఇరవై ఏళ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన వ్యక్తి అభివృద్ధిని గాలికి వదిలేశాడని, మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. ఆసరా పింఛన్ల పెంపు, రూ.400 లకే గ్యాస్ సిలిండర్, రైతుబంధు పెంపు తదితర సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతగానే ఉపయోగపడతాయని అన్నారు. అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి తనను మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మారగోని భవాని గణేశ్, బీఆర్ఎస్ నాయకులు కుందూరు ప్రవీణ్‌రెడ్డి, మాతంగి అమర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి చూసి ఓటు వేయండి

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


నార్కట్‌పల్లి : రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : నకిరేకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో మునుగోడు చౌరస్తా నుంచి అమ్మనబోలు చౌరస్తా వరకు రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తలకే మళ్లీ కండువాలు కప్పి పార్టీలో చేరుతున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, పుల్లెంల ముత్తయ్య, దుబ్బాక పావని శ్రీధర్, చిరుమర్తి యాదయ్య, రైతు బంధు సమితి అధ్యక్షుడు యానాల అశోక్‌రెడ్డి, సర్పంచ్‌లు మల్ల రమణ బాలకృష్ణ, గోసుల భద్రాచలం, బద్దం రాంరెడ్డి, దోసపాటి విష్ణు, సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కమ్మంపాటి వెంకటయ్య, ప్రజ్ఞాపురం రామకృష్ణ, నరేష్ తదితరులు ఉన్నారు.

దుర్గామాత పూజలో పాల్గొన్న చిరుమర్తి

నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని 13వ వార్డు కనకదుర్గ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద శుక్రవారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపా

నకిరేకల్ : నకిరేకల్ పట్టణాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపానని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ పట్టణంలోని ప్రధాన రోడ్డు వెంట శుక్రవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వ్యాపారస్తులను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, నాయకులు సోమ యాదగిరి, పెండెం సదానందం, రాచకొండ వెంకన్నగౌడ్, దైద పరమేషం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు


వేడుకల్లో పాల్గొన్న గ్రామ పెద్దలు


కల్యాణంలో పాల్గొన్న చాడ కిషన్‌రెడ్డి దంపతులు

శాలిగౌరారం : శాలిగౌరారం ప్రాజెక్టు వద్ద గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఎదుట నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయంలో రెండోరోజు శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణోత్సవాన్ని వేద పండితులు కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో విగ్రహదాత చాడ కిషన్‌రెడ్డి దంపతులు, ఆలయ ధర్మకర్తలు శేషభట్టర్ నర్సింహాచార్యులు, రత్నమాచార్యులు, రామచంద్రాచార్యులు, జగన్మోహనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అవతారంలో దుర్గామాత


నల్లగొండ : కలెక్టరేట్ సమీపంలోని మణికంఠ నగర్ ఆలయంలో సరస్వతీ దేవి మూల విరాట్


నకిరేకల్ : అభిషేకం చేస్తున్న బచ్చుపల్లి గంగాధర్‌రావు

కట్టంగూర్ : దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు సరస్వతీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. ముత్యాలమ్మగూడెంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద జెడ్పీటీసీ తరాల బలరాములు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని జెడ్పీటీసీ ప్రారంభించారు.

శాలిగౌరారం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సరస్వతీ దేవి అవతారంలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శాలిగౌరారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలతోపాటూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. శాలిగౌరారంలో జరిగిన పూజా కార్యక్రమంలో బుడిగె శ్రీనివాసులు చిన్నారులకు పలకలు, నోటుబుక్స్, పెన్నులను అందజేశారు.

దుర్గామాత పూజలో పాల్గొన్న పాశం రాంరెడ్డి

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని బీసీ కాలనీలో దుర్గమాత మండపం వద్ద జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీ భక్తులకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రొట్టెల రమేష్, ముత్తినేని శ్యాంసుందర్, పోకల సతీష్, జాకటి మోష తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు అభిషేకం

నకిరేకల్ : వివేకానంద యువజన మండలి ఆధ్వర్యంలో నకిరేకల్ మండలంలోని చందుపట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గామాత విగ్రహం వద్ద శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యసంఘం అధ్యక్షుడు మంగినపల్లి వెంకటయ్య, బెజవాడ లక్ష్మీనారాయణ, కోటగిరి రామకృష్ణ పాల్గొన్నారు.

కనగల్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల ఆలయంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారు శుక్రవారం శ్రీ సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పార్టీ మారుతున్నారనే ప్రచారం తగదు


మాట్లాడుతున్న మన్నె కృష్ణార్జునరెడ్డి

నల్లగొండ టూటౌన్ : బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పార్టీ మారుతున్నారని కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేయడం తగదని, తాము బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని నల్లగొండ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మన్నె కృష్ణార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నాయకత్వంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లంతా కలిసికట్టుగా పని చేసి గ్రామాలను అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బకరం వెంకన్న, ఎంపీటీసీ మల్లేష్, సర్పంచ్‌లు బైరెడ్డి వెంకట్‌రెడ్డి, పబ్బత్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, సైదులు, తిరుమలేష్, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.